# శ్రీరంగ నీతులు

## పాలకూర సీతాలత

ఆచారి సోఫాలో వాలి ఏదో ప్రముఖ వార పత్రికలో ప్రముఖ సినీతార సుందరీ దేవితో జరిపిన ఇంటర్వ్యూ దీక్షగా చదివేడు. "అతి తక్కువ కాలంలో తన సహజ నటనా కౌశలంతో ప్రముఖ తారగా పేరు పొందిన సినీతార 'శ్రీమతి సుందరీ దేవి'తో మా విలేఖరి జరిపిన ఇంటర్వ్యూ యధాతథంగా ప్రచురిస్తున్నాం."

విలేఖరి : నమస్కారమండీ...

సుందరి : నమస్కారం... దయచెయ్యండి... కూర్చోండి.

వి : థ్యాంక్యూ... ఈ రోజుమీరు ఇంట్లో వుంటారో లేదో అని అనుమానిస్తూ వచ్చాను. నేను, మా పాఠకులు అదృష్టవంతులం... మీరు దొరికారు.

సుం : నిజానికి ఈ పాటికి నేను 'ఉడుతా ఫిల్మ్స్' వారి రెండవ చిత్రం తాలూకు షూటింగ్‌కి వెళ్లవల్సి వుంది. అందుకు తయారయ్యాను కూడా...



కానీ చివరి క్షణంలో ఫోను వచ్చింది... సెట్టు రెడీ కావడానికి మరో గంట పడుతుందట.. అందుకే వుండి పోయాను.. ఇంతలో మీరు వచ్చారు.

వి : ఇంటర్వ్యూ మొదలు పెడతాను.

సుం : ఒ.కే.

వి : మీ తొలి చిత్రం ఏది?... అందులో అవకాశం మీకు ఎలా వచ్చింది?

సుం : నా తొలి చిత్రం 'పోతురాముడు.' అవకాశం దానంతట అదే వెతుక్కుంటూ వచ్చింది. నేను ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. బహుశ భగవంతుడు నా నుదుటన సినీతార కమ్మని రాశాడు కాబోలు.

వి : మిమ్మల్ని ఈ రంగానికి పరిచయం చేసింది ఎవరు?


సుం : ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ సమోసాల శ్రీహరిరావుగారు. ఒకసారి నేను మావారితో ఒక ఫంక్షన్‌కు వెళ్లాను. అక్కడే ఆయన నన్ను చూశారు. తర్వాత మావారిని అడిగేరు. ఆయన **ఒప్పుకున్నాకా** ఈ ''పోతురాముడు'' లో **నటించా**ను. నా నటనకు గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఎన్నో ఆఫర్లు వచ్చాయి.

వి : ఇంత వరకు ఎన్ని చిత్రాల్లో నటించారు? మీకు నచ్చిన చిత్రాలు ఏవి?

సుం : దాదాపు నలభై. నేను ధరించిన పాత్రలన్నీ నాకు నచ్చినవే... పాత్ర నచ్చక పోతే నేను అంగీకరించను... ఈ మధ్య ఆరుచిత్రాల్లో వేషం నచ్చక తిప్పి కొట్టాను.

వి : మీకు బాగా పేరు తెచ్చిన చిత్రాలు ఏవి?

సుం : చాలా వున్నాయి. చెప్పడం కష్టం...



అయినా నేను నటించిన చిత్రాల్లో సూపర్ హిట్ అయిన చిత్రాలు కొన్ని వున్నాయి. వాటి పేర్లు చెప్తాను.. ''పేరుగొప్ప — ఊరుదిబ్బ''; ''సన్యాసి రాముడు''; ''కనపడదు — వినపడదు''; ''చస్తావా — చంపనా?''; ''షటప్ రాస్కెల్''; ''శీలం ఎరుగని సావిత్రి''; ''డబ్బారేకుల సుబ్బారాయుడు''; ''చీరకట్టిన వీర వనిత''; ''అప్పడాలు — వడియాలు''; ''బీరు — నీరు''; ''కడుపు నిండిన కనకయ్య — కడుపు మాడిన కాంతయ్య'' —అన్న చిత్రాలు.

వి : మీ శ్రీవారిపై మీ అభిప్రాయం?

సుం : ఆయన నా పాలిట భగవంతుడు. ఆయన సహకారం లేకపోతే నేను ఈ రోజున ఇంత పెద్దతార అయ్యేదాన్ని కాదు. ఆయన నన్ను ఎప్పుడూ ప్రోత్సహిస్తూంటారు. ఆయనకు నేను సర్వదా కృతజ్ఞురాలను. ఉదయం లేవగానే ఆయన కాళ్లకు నమస్కారం చేస్తాను. ఆ సమయానికి మెళ్లో వుంటే, మంగళ సూత్రాలు కళ్లకు అద్దుకుంటాను. ఆయన కోసం నేను నోములు నోస్తాను. ఆ మధ్య ఒక శ్రావణ మంగళవారం నేను అవుట్ డోర్‌లో వుండగా వచ్చింది. ఆ రోజు షూటింగ్ కాన్సిల్ చేసుకుని ఆ ఊళ్లో అందర్నీ పేరంటం పిలిచాను. నా భర్త కోసం నేను ఏం చెయ్యడానికైనా సిద్ధం. అనురాగం పంచి ఇచ్చే ఆ ప్రేమ మూర్తి లేక పోతే నా బ్రతుకే లేదు. ఆయనకు సేవలు చెయ్యడంలో నాకు ఆనందం వుంది. ఆయన తర్వాతే నాకు సినిమాలు. సతిగా బాధ్యతలు నెరవేర్చుకున్న తర్వాతే తారగా అవతారం ఎత్తుతాను. ఆయన బట్టలు నేనే ఉతుకుతాను. అది నాకు ఆనందం. ఆయనకు స్వయంగా నేనే భోజనం వడ్డిస్తాను. అది నాకు సంతోషం. ఆయన లేనిదే నేను లేను.

వి : మీరు ఎందరో హీరోలతో ఎన్నో ప్రేమసన్నివేశాలలో నటించారు. ఆ సమయంలో మీ భర్త గుర్తువస్తారా? ఆయన ఆ సన్నివేశాలు చూస్తే ఏమంటారు?

సు : అదంతా కేవలం నటన. ఆ సమయంలో భర్త గుర్తుకు వచ్చినా అది నటనేకదా అని సరి పెట్టు కుంటాను. ఆయనకూ అది నటన అని తెలుసు. కనుక ఏదో అనుకుంటారన్న ప్రసక్తి లేదు.

వి : అయితే మీ శ్రీవారు చాలా గొప్పవారు.

సుం : అవును. అందులో సందేహం లేదు. అందుకే ఆయనంటే నాకు చాలా చాలా ఇష్టం. ఆయన భర్తగా దొరకడం నా అదృష్టం. మళ్లీ జన్మలో కూడా ఆయనే నాకు భర్త కావాలని ప్రతి రోజూ భగవంతుడిని ప్రార్థిస్తూ వుంటాను. నాకు ఐశ్వర్యం అక్కర్లేదు. ఆయనే చాలు.

వి : మీ జీవితాశయం ఏమిటి?

సుం : 'రంభ అవార్డు' అందుకోవాలని. ఆరోజు ఎంతో దూరంలో లేదని నా నమ్మకం.

వి : ప్రస్తుతం మీరు నటిస్తున్న చిత్రాలు?

సుం : షూటింగు జరుగుతున్నవి అయిదు. ఇవి కాక ఇంకో ఎనిమిది తెలుగు చిత్రాలు, **అయిదు**

తమిళ చిత్రాలు, రెండు మళయాల చిత్రాలు అంగీకరించాను.

వి : మీ అభిమాన హాలీవుడ్ నటుడు ఎవరు?

సుం : గ్రిగరీ షరీఫ్.

వి : మా పాఠకులకు ప్రత్యేకంగా ఏమైనా చెప్పదల్చు కున్నారా?

సుం : వారు చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను.

వి : కొత్తగా సినీరంగంలో ప్రవేశించ దల్చుకున్న వాళ్లకు మీరు ఇచ్చే సలహా?

సుం : ఉత్సాహం మంచిదే కానీ ఈ రంగంలోకి దిగ వద్దని సలహా. చాలా నష్టాలతో, కష్టాలతో కూడిన రంగం ఇది. మేం ఏదో సుఖపడి పోతున్నామని అందరూ అపోహపడతారు కానీ ఇది నిజానికి ముళ్లలోకం. అందుకే ఈ తళుకు బెళుకుల రంగానికి దూరంగా వుండమని సలహా ఇస్తాను.

వి : థాంక్స్. మరి వస్తానండీ. మా పత్రిక తరపున మీకు కృతజ్ఞతలు.

సుం : (చిరునవ్వుతో) థాంక్స్. నమస్తే.. .. ..

* * *

ప్రభాకర్ పడక కుర్చీలో కూర్చుని ఒక ప్రముఖ సినీ పత్రిక చదువుతున్నాడు. అందులో ప్రముఖ హీరో ''ప్రవీణ్'' తో జరిపిన ఇంటర్వ్యూ ప్రచురింప బడింది. ఆసక్తిగా దాన్ని చదివేడు.

''డాషింగ్ హీరో కీర్తి వహించిన శ్రీ 'ప్రవీణ్' గారితో మా విలేఖరి జరిపిన ఇంటర్వ్యూని యధాతథంగా ప్రచురిస్తున్నాం.

విలేఖరి : నమస్కారమండీ.

ప్రవీణ్ : నమస్కారం. దయచేయండి. కూర్చోండి.

వి : థాంక్యూ!... మా పత్రిక తరపున మిమ్మల్ని ఇంటర్వ్యూ చెయ్యడానికి వచ్చాను. నా అదృష్టం కొద్దీ మీరు ఈ రోజు చిక్కారు.

ప్ర : షూటింగ్‌కు సిద్ధమయి వెళ్లబోతుంటే వచ్చారు. మిమ్మల్ని నిరాశ పరచను. కానియ్యండి.

వి : మీ తొలి చిత్రం ఏది? ఆ అవకాశం ఎలా వచ్చింది?

ప్ర : నా తొలి చిత్రం ''చల్లకొచ్చి ముంత దాచకు.'' ప్రముఖ దర్శకుడు శ్రీ పకోడీల పరాత్పరంగారు నన్ను తెరకు పరిచయం చేశారు. ఈ అవకాశం దానంత అదే వచ్చింది. అంతే... ఆ చిత్రం బాగా హిట్టయ్యింది. దాంతో అవకాశాలు వచ్చాయి. ఈ రోజూ తీరిక దొరకనంతగా ఆఫర్లు వున్నాయి.

వి :ఇంత వరకూ ఎన్ని చిత్రాల్లో నటించారు?

ప్ర :దాదాపు యాభై.

వి : మీకు నచ్చిన పాత్రలు అందులో ఏవి?

ప్ర : అన్నీ నచ్చినవే. నచ్చక పోతే అసలు అంగీకరించను. బాగా పేరు తెచ్చిన చిత్రాలు ఏవని అడిగితే చెప్పగలను.

వి : చెప్పండి.

ప్ర : 'చస్తావా — చంపనా?'; 'డబ్బారేకుల సుబ్బారాయుడు'; 'బీరు — నీరు'; 'వస్తావా? రావా?'; 'అడ్డగాడిదలు'; 'మనిషికాదు — పశువు'; 'పోయిన పోలయ్య — వచ్చిన వీరయ్య'; 'ఆకుకు సున్నం — ఇంటికి కన్నం'; 'నోరుముయ్యి..'; 'ఎంగిలాకులు' —మొదలైన చిత్రాలు.

వి : మీ శ్రీమతి గారు మీ చిత్రాలు చూస్తారా?

ప్ర : ఆ! ఆసక్తితో.

వి : ఆమెపై మీ అభిప్రాయం?

ప్ర : ఆమె మంచితనం, సహకారం గురించి నేను ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఆమె అనురాగమయి. ఏ జన్మలోనో నేను చేసుకున్న పుణ్యం కొద్దీ ఆమె నాకు దొరికింది. ఆమె లేనిదే నా బ్రతుక్కి అర్థం లేదు. ఆమెను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఆమెనా ఇంటి దేవత. ఆ సుగుణాల రాశి, ప్రేమ మూర్తి. చల్లని మనసుతో, నిండు హృదయంతో నా ఇంట్లో నట్టాడుతూ వుంటే నాకు ఏమీ అక్కర్లేదు. ఆమెను విడిచి నేను వుండలేను. ఆమెకు నేను ఇచ్చే విలువ, గౌరవం, ప్రేమ కొలవరానివి. ఎన్ని జన్మలకైనా ఆమె నా భార్య కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాను. ఆమెకు కొంచెం నలత చేసినా నేను ఆకులా విలవిల లాడిపోతాను. ఆమెకు కష్టం, కన్నీరు అంటే ఏమిటో తెలియకుండా చెయ్యడం నా జీవితాశయం. ఆమె తోటి నాజీవితం నాకు తృప్తినిస్తుంది. ఆమె కోసం నేను ఏం చెయ్యమన్నా చేస్తాను. మా ఇద్దర్నీ ఇలాగే కలిపి వుంచమని రోజూ ఉదయం లేవగానే భగవంతుడిని కోరుకుంటాను. ఆమె అనురాగం గురించి చెప్పడానికి మాటలు లేవు. ఆమె మీద నాకున్న ప్రేమ గురించి వక్కాణించడానికి భాష చాలదు.

వి : మీతో ఎంతమంది హీరోయిన్‌గా నటించారు?

ప్ర : దాదాపు ఈరోజు తెర మీద వెలుగుతున్న వాళ్లందరూ నాతో నటించారు. ఎక్కువగా నేను




**కీచులాటలు**

''అబ్బబ్బా... ఆ ఇంటి ఆవరణలో మీరెలా వుంటున్నారొదినా! చుట్టూ కాపరాలు ఎప్పుడూ ఏవో కీచులాటలు...'' అంది కాంతం.

''ఆ కీచులాటలు వింటూంటే ఎంత హాయిగా వుంటుందనీ... అందుకే ఆ ఇల్లు వదిలి వెళ్ళబుద్ధి కావడం లేదంటే నమ్ము'' అంది రమణమ్మ.

—డి. సీతాదేవి (తెనాలి)

**చెబుతా**



శ్రీమతి సుందరిగారితో నటించాను. ఆమె నటించిన పాతిక చిత్రాల్లో ఆమెతో హీరోగా నేను ఇరవై చిత్రాల్లో నటించాను. మా ఇద్దరినీ తెరమీద 'హిట్‌జంట' గా అందరూ చెప్పుకోవడం మీకు తెలుసు.

వి : అవును. ఆమెపైన మీ అభిప్రాయం?

ప్ర : చక్కని నటి. స్నేహశీలి. షూటింగ్ లేనప్పుడు విరామ సమయంలో మేం ఇద్దరం కూర్చుని చాలా విషయాలు చర్చించు కుంటూ వుంటాం. మంచి మనిషి. గుడ్‌గర్ల్. ఐ లైక్‌హర్.

వి : మీరు చాలా మందితో ప్రేమ సన్నివేశాలలో నటించారు కదా! మీ భార్య అది చూసి.. ..

ప్ర : (నవ్వుతూ) భలేవారే.. ఇందులో అనుకుందుకు ఏముంది? అదంతా నటన. జస్ట్... ఏక్షన్... ఆ విషయం ఆమెకు తెల్సు. ఆమె నన్ను ప్రోత్సహిస్తూంటుంది కూడా. 'ఫలానా సినిమాలో హీరోయిన్‌తో చాలా చక్కగా రొమాన్సు చేశారు...' అంటుంది.

వి : అయితే ఆమె చాలా గొప్పవారు.

ప్ర : యస్.. నేనూ అదే కదా అన్నది.. ఆమె నా భాగ్యరేఖ.

వి : మీ జీవితాశయం ఏమిటి?

ప్ర : అభిమానులు నటులందరికీ ఏదో ఒక బిరుదు ఇచ్చేస్తున్నారు కదా! అలాగే నాకు 'నట చక్రవర్తి' బిరుదు అందుకోవాలని వుంది. అందుకు కృషి చేస్తాను. ఒక పద్మశ్రీ బిరుదు, ఒక డాక్టరేటు చాలు నాకు.

వి : ప్రస్తుతం మీరు నటిస్తున్న చిత్రాలు?

ప్ర : దాదాపు ఇరవై వున్నాయి, షూటింగ్ నడుస్తున్నవి. కొత్తగా ఒప్పుకున్నవి ఆరు. మరో రెండు సంవత్సరాల వరకూ తీరిక లేక కొందరు పెద్ద నిర్మాతలను నిరాశ పరచ వల్సి వచ్చింది.

వి : మా పాఠకులకు ఏమైనా చెప్పదల్చుకున్నారా?

ప్ర : వారు నాపై చూపిస్తున్న అభిమానానికీ, నాకు ఇస్తున్న ప్రోత్సాహానికీ కృతజ్ఞతలు. ఈ రోజు నేను ఇలా వుండడానికి కారణం వాళ్ళే అందరికీ సవినయంగా నమస్కరిస్తూ ఇదే ప్రోత్సాహం ముందు ముందు కూడా లభ్యం కావాలని కోరుతున్నాను.

వి : అభిమానులు మీ ఇంటికి వస్తే చిరాకుపడతారా?

ప్ర : నో... నా అభిమానులు నావాళ్లు. వాళ్లకు సదా స్వాగతం చెప్తాను. వాళ్లను గౌరవిస్తాను.

వి : ఈ సినీ రంగం పైన మీ అభిప్రాయం ఏమిటి?

ప్ర : సద్భావమే. నాకు తిండి పెడుతున్న రంగం ఇది. దాని గురించి చెడ్డగా చెప్పను.

వి : కొత్తగా హీరో కావాలనుకునే వాళ్లకు మీరిచ్చే సలహా?...

ప్ర : (ఆలోచించి) కొత్తవాళ్లకు ప్రోత్సాహం ఇయ్యడం అవసరమే. అర్హతకూడా చూడాలి. నటనానుభవం లేకుండా చిత్రాలకు ఎగబడటం మంచిది కాదు.

వి : మీరు చిత్రరంగానికి రాకముందు నటనానుభవం వుందా?

ప్ర : నాసంగతి వది లెయ్యండి. నాకు లేదు... కాని అందరూ ప్రవీణ్‌లు కారుగా.

వి : బాగా చెప్పారు. వస్తానండి. శలవు. చాలాథాంక్స్.

ప్ర : నో మెన్షన్.

* * *



## రణరంగం

"ఆడది గడప దాటితే అనర్థ మంటారెందుకు!" అడిగింది అపర్ణ.

"గడప దాటితే ఇల్లే కాకుండా వీధులు కూడా రణరంగంగా మారతాయని..." అన్నాడు విశ్వం.

—సి. నటరాజన్ (ఇరువారం)

రామయ్య గాద్రెజ్ కుర్చీలో కూర్చుని ఒక మాసపత్రికలో 'సినిమా కబుర్లు' చదువుతున్నాడు. అందులో ఒకవార్త ప్రముఖంగా ప్రచురింప బడింది. దాన్ని చదివేడు.

"ప్రముఖ హీరో ప్రవీణ్ కుమార్, ప్రముఖ హీరోయిన్ సుందరీ దేవిల వివాహం. శ్రీ ప్రవీణ్ తన భార్యకు విడాకులు ఇచ్చారు. అలాగే సుందరీదేవి కూడా తన భర్తకు విడాకులు ఇచ్చింది. 25వ తేదీన నిరాడంబరంగా జరిగిన వీరి వివాహానికి చిత్రసీమలోని ప్రముఖులంతా వచ్చి ఆశీర్వదించారు. కలకాలం కలిసి జీవించమని అభినందించేరు. శ్రీప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ—

"సుందరీ దేవితో నేను ఎన్నో చిత్రాల్లో నటించాను. ఆమెతో ఎన్నో ప్రేమ సంఘటనలు జరిగాయి, కెమేరా ముందు, కొన్నాళ్ల తర్వాత నిజంగానే ప్రేమ పుట్టుకు వచ్చింది. నేను నా భార్యను మర్చిపో గలిగేంతగా ఆమె నన్ను ఆకర్షించింది. అందుకే ఆమెకు దూరం అయ్యి ఈమెను చేసుకున్నాను. సుందరీ దేవీ మంచి తనాన్ని నేను మాటల్లో చెప్పలేను." అన్నారు.

శ్రీమతి సుందరీ దేవి మాట్లాడుతూ—

శ్రీ ప్రవీణ్ కుమార్ గారు ఎంత ఉత్తముడో నేను మాటల్లో చెప్పలేను. ఆయనతో ఒక్కొక్క చిత్రంలో నటిస్తుంటే ఆయనపై అనురాగం ఒక్కొక్క మెట్టు పెరుగుతూ వచ్చింది. ఆయన లేక పోతే నా బ్రతుక్కి అర్థం లేదని పించింది. అందుకే నా భర్తకు విడాకులు ఇచ్చి ఈయన్ను చేసుకున్నాను. ప్రేమించే వ్యక్తిని భర్తగా పొందగల్గిన నేను చాలా అదృష్టవంతురాలను..." అన్నారు.

పుస్తకం మూసి విసిరి కొట్టాడు రామయ్య. *

సలహా

